అంధుల పాఠశాలలో పండ్ల పంపిణీ

సనత్‌నగర్: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జన్మదిన వేడుకలను బేగంపేటలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మయూరిమార్గ్‌లోని దేవనార్ అంధుల పాఠశాలలోని విద్యార్థులకు బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కృష్ణారావు లాంటి నేత కూకట్‌పల్లి ఎమ్మెల్యేగా ఉండడం ప్రజలందరి అదృష్టమని నిరంతరం ప్రజల కోసం తపిస్తూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం ద్వారానే భారీ మెజార్టీతో హ్యాట్రిక్ విజయాన్ని అందించారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి, సురేష్‌యాదవ్, సామల పాండు పాల్గొన్నారు.

సుభాష్‌రోడ్‌లో నటి పూర్ణ సందడి



నగలను ప్రదర్శిస్తున్న పూర్ణ

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ సుభాష్‌రోడ్‌లోని వెంకటరమణ కట్టు గాజులు, జువెలర్స్‌లో సినీనటి పూర్ణ సందడి చేశారు. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయం ప్రాంతంలో 5 బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ హోం మంత్రి మహమూద్ అలీ, యజమాని త్రినాథ్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

ఒకరికి గాయాలు



సనత్‌నగర్: మితిమీరిన వేగంతో కారు డివైడర్‌ను ఢీకొట్టగా ఒకరికి గాయాలైన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. టీఎస్07 యూఎం 1920 నెంబర్ గల టాటా ఎక్స్‌ప్రెస్ కారు సోమవారం ఉదయం 5.30 గంటలకు సికింద్రాబాద్ వైపు నుంచి గచ్చిబౌలి వైపు వెళ్తుంది. బేగంపేట ఫ్లైఓవర్ మీదకు రాగానే డ్రైవర్ నాగ ప్రసన్న వేగంతో నిర్లక్ష్యంగా కారును నడిపి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఆ సమయంలో కారులో ఉన్న హకీంపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గౌతమ్ (22)కు గాయాలయ్యాయి. వెంటనే అతనిని చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.



మోండా మార్కెట్ రోడ్డుపై ట్రాఫిక్ జామ్

మోండా మార్కెట్.. ట్రాఫిక్‌తో ఇరిటేట్!

- రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతో స్తంభిస్తున్న ట్రాఫిక్
- ఇక్కట్లు పడుతున్న వాహనదారులు
- దృష్టి సారించని అధికారులు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ సుప్రసిద్ధమైన మోండా మార్కెట్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్య ఇక్కట్లకు గురి చేస్తోంది. అడుగడుగునా ట్రాఫిక్‌జామ్‌తో ప్రత్యక్ష నరకం చూడాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. నిత్యం వందలాది వాహనాలు వేలాది జన సంచారం ఉన్న ఈ ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణ కొరవడింది. ట్రాఫిక్ పోలీసు అధికారుల పర్యవేక్షణాలోపం సిబ్బంది నిర్లక్ష్యంతో వాహనచోదకులు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీకావు. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల నుంచి నిత్యం వందలాది మంది ప్రజలు కూరగాయలు, నిత్యావసర సరకులు ఇతరత్రా వస్తువుల కొనుగోళ్ల కోసం ఇక్కడి వస్తుంటారు. ఇతర ప్రాంతాలతో పోల్చుకుంటే మోండా మార్కెట్‌లో వివిధ రకాల వస్తువుల ధరలు తక్కువగా ఉంటాయి కాబట్టి జనం ఇక్కడికి తరలివస్తుంటారు. పెరుగుతున్న వాహనాల రద్దీ, జనసంచారానికి అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. రోడ్లపై ఓ వైపు ఫుట్‌పాత్ వ్యాపార కార్యకలాపాలు, మరో వైపు ఆటోవాలాల ఇష్టానుసారంగా పార్కింగ్, తోపుడుబండ్ల వ్యాపార కార్యకలాపాలు ఇక్కడి ట్రాఫిక్ విఘాతం కలిగిస్తున్నాయి. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన సిబ్బంది తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ఈ దుస్థితి నెలకొంటుందని వాహనదారులు, పాదచారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణలపై ప్రశ్నిస్తే దాడులే..

మోండా మార్కెట్‌కు రెండు వైపులా ఉన్న రోడ్లపై నిత్యం ట్రాఫిక్‌జామ్ అవుతోంది. బాటా ఎదురుగా స్వీట్‌హౌస్ నుంచి ఓల్డ్‌జైల్, పాట్‌మార్కెట్, మోండా మార్కెట్, సజ్జన్‌లాల్ స్ట్రీట్, మారుతీవీధి, పాలికాబజార్ చౌరస్తా, 31 బస్టాప్ రోడ్డు, ఆల్ఫాహోటల్ రోడ్డు, ఇస్లామియా స్కూల్, గాస్‌మండి, ఆదయ్యనగర్, సాంబమూర్తినగర్, బోయిగూడ బ్రిడ్జి వరకు భారీగా ట్రాఫిక్ జామ్‌తో ఈ ప్రాంతం కిక్కిరిసిపోతోంది. మోండా మార్కెట్ ఇందిరాగాంధీ విగ్రహం సమీపంలో ఓ వ్యాపారి రోడ్డును ఆక్రమించి తన కార్యకలాపాలను సాగిస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్నా పట్టించుకునేనాథుడే కరువయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మోండా మార్కెట్ వెనుక గేటు ముందు రోడ్డులో పండుగ సమయాల్లో ప్రజలు ట్రాఫిక్‌తో నరకయాతన పడుతున్నారు. మోండా మార్కెట్ పరిసర ప్రాంతాల్లోని రోడ్లపైనే వ్యాపార కార్యకలాపాలు ట్రాఫిక్‌కు గుదిబండగా మారాయి. అనేక మంది తోపుడు బండ్ల నిర్వాహకులు రోడ్లపైనే తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. వీటిపై ఎవరైనా ప్రశ్నిస్తే దాడులకు సైతం దిగుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చేతులు తడిపి ఆక్రమణలు..

షోలాపూర్ స్వీట్‌హౌస్ సమీపంలోని పండ్ల వ్యాపారులు రోడ్లపైనే తమ కార్యకలాపాలు సాగిస్తుండటంతో ఇక్కడ నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. వ్యాపారస్తుల ఫుట్‌పాత్ ఆక్రమణలు, తోపుడ బండ్లు, చిరు వ్యాపారుల కార్యకలాపాల కారణంగా మోండా మార్కెట్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్ర రూపం దాల్చుతున్నాయి. మోండా మార్కెట్ పరిసర ప్రాంతాల్లోని అనేక మంది తోపుడు బండ్ల నిర్వాహకులు, చిరు వ్యాపారులు స్థానిక నాయకులు, ట్రాఫిక్ సిబ్బందికి ఎంతో కొంత ముట్టజెప్పి తమ వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. నిత్యం జనం సంచారంతో రద్దీగా ఉంటే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసుల నియంత్రణ కొరవడిందనేది వాస్తవం. సదరు రోడ్లపై ట్రాఫిక్ సమస్యను క్లియర్ చేయడానికి కనీసం ఇద్దరూ లేదా ముగ్గురు పోలీసు ఇబ్బంది ఉండాలి అయితే ఏ ఒక్కరు కూడా సక్రమంగా విధులు నిర్వహిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ట్రాఫిక్ నియంత్రణను గాలికి వదిలి ఎంతసేపు హెల్మెట్ లేకుండా రాకపోకలు సాగించే వారి ఫొటోలపైనే ఎక్కువగా శ్రద్ధ చూపుతున్నారని పలువురు వాపోయారు.

పార్కింగ్ ప్రణాళిక ఏమైనట్లో?

మోండా మార్కెట్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ వాహనాల పార్కింగ్ కోసం ఓ ప్రణాళికను రూపొందించాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. నాటి రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ట్రాఫిక్, జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఇతరత్రా అధికారులతో ఈ ప్రాంతంలో పర్యటించారు. మోండా మార్కెట్‌కు వచ్చే వారి వాహనాల కోసం ప్రత్యేకంగా ఓ పార్కింగ్ ఏర్పాటు చేయాలని అందుకు ప్రణాళికలను రూపొందించాలని తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. అయితే అందుకు తగ్గ విధంగా ఓల్డ్ జైలు వెనుక భాగంలో ఖాళీ స్థలంలో పార్కింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే సదరు ప్రణాళికకు ఇంతవరకు అతీగతీ లేకుండా ఉంది. ఇంతకు సదరు ప్లాన్ ఉన్నట్టా లేక అటకెక్కాయా అనే సందేహాలు విన్పిస్తున్నాయి. మోండా మార్కెట్‌కు వచ్చే వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ వ్యవస్థ ఏర్పాటు చేస్తే తప్ప ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి నోచుకోదని పలువురు అంటున్నారు.

అద్దెలకు ఫుట్‌పాత్‌లు..

మోండా మార్కెట్ పరిసరాల్లో అసలే ఇరుకైన రోడ్లు దానికి తోడు ఫుట్‌పాత్ ఆక్రమణలు, వ్యాపార కార్యకలాపాలు ప్రజలకు సంకటంగా మారాయి. మోండా మార్కెట్ రోడ్లు, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాల్లోని ఫుట్‌పాత్‌లను నాయకులు అద్దెలకిచ్చి డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి. సదరు నాయకులు ట్రాఫిక్ పోలీసులను మచ్చిక చేసుకొని ఎంతో కొంత మామూళ్లు ఇస్తూ మనుగడ సాగిస్తున్నారనేది బహిరంగ రహస్యం.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు..

మోండా మార్కెట్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తగిన చర్యలు తీసుకుంటాం. ట్రాఫిక్ ఇబ్బంది కలిగించే వారితో పాటు రోడ్లను ఆక్రమించి ఫుట్‌పాత్‌లపై వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. మోండా మార్కెట్ పరిసర ప్రాంతాల్లోని రోడ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఆక్రమణలు తొలగించి వాహనదారులు, ప్రజలు సులువుగా రాకపోకలు సాగించే విధంగా చర్యలు తీసుకుంటాం.

–ఉప శంకర్, మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

స్కౌట్ జంబోరీకి 'అక్షర' ప్రిన్సిపాల్



వనజను అభినందిస్తున్న యాజమాన్యం

కంటోన్మెంట్: ఈ నెల 20వ తేదీ నుంచి శ్రీలంకలో జరుగనున్న పదో జాతీయ స్కౌట్ జంబోరీలో పాల్గొననున్న భారత ప్రతినిధి బృందానికి సికింద్రాబాద్‌లోని అక్షర వాగ్దేవీ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ వనజ ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో స్కూలు యాజమాన్యం వనజను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆర్‌జీఆర్ సిద్ధాంతి విద్యాసంస్థల వ్యవస్థాపకులు పీఎల్ శ్రీనివాస్‌ను మాట్లాడుతూ.. ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి తమ పాఠశాల ప్రిన్సిపాల్ ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఏఓ శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ రచన, అడ్మిన్ ఇన్‌చార్జి కో–ఆర్డినేటర్ మహేశ్వరి, స్మిత పాల్గొన్నారు.

స్థానికంగానే డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలి



హబ్సిగూడలోని డిస్పెన్సరీ

లాలాపేట: తార్నాక పరిసర ప్రాంతాలకు చెందిన ఉద్యోగుల సంబంధించిన కార్మిక రాజ్య భీమా చికిత్సాలయం (ఈఎస్ఐ డిస్పెన్సరీ)ని హబ్సిగూడలో ఏర్పాటు చేశారు. దీంతో తార్నాక, లాలాపేట, శాంతినగర్, లాలాగూడ, రవీంద్రనగర్ తదితర ప్రాంతాల్లోని ఈఎస్ఐ లబ్ధిదారులు హబ్సిగూడ వెళ్లాలంటే ఎంతో వ్యయ ప్రయాసలను భరించాల్సి వస్తుంది. బీపీ, షుగర్ వంటి నెల వారి మందుల కోసం ప్రతి నెల ఆటో, క్యాబ్‌లలో అక్కడి ఉద్యోగులు, పెన్షనర్లు వెళ్తున్నారు. తీరా అక్కడికి వెళ్లాక ఒక్కోసారి ఆటో, క్యాబ్ కిరాయి డబ్బులకు సరిపడా వైద్య సేవలు, మందులు ఇవ్వడం లేదని పలువురు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి స్థానికంగానే డిస్పెన్సరీని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



డీసీ సుభాష్ రావును కలిసిన బీజేపీ నేతలు

అడ్డగుట్ట: డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులన్నీ త్వరిత గతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు సోమవారం డిప్యూటీ కమిషనర్ సుభాష్ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అడ్డగుట్ట చౌరస్తా నుంచి నందనార్ నగర్ గణేష్ టెంపుల్ వరకు వరద నీటి పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని అదే విధంగా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ ధ్వంసమై అధ్వానంగా మారాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో హంసరాజు, వేణుగోపాల్, నరేందర్, శివలింగం, ఉదయ్, శివాజీ, ప్రసాద్, రాజేష్ పాల్గొన్నారు.

బీజేఆర్ నగర్‌లో కార్పొరేటర్ పర్యటన



పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బీజేఆర్ నగర్‌లో సోమ వారం కార్పొరేటర్ హేమలత పర్యటించి బీజేఆర్ నగర్‌లో సుమారు రూ.61 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న నూతన డ్రైనేజీ పైపులైన్ పనులను పరిశీలించారు. భవిష్యత్‌లో డ్రైనేజీ సమస్య లేకుండా తగిన విధంగా నిర్మాణాలు చేపట్టాలని జలమండలి అధికారులకు సూచించారు. బీజేఆర్ నగర్‌లో డ్రైనేజీ శాశ్వత పరిష్కారానికి గట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు. లక్షలాది రూపాయల వ్యయంతో డ్రైనేజీ పనులను చేపడుతున్నామని బీజేఆర్‌నగర్ బస్తీ అభివృద్ధికి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. కమ్యూనిటీహాల్ నిర్మాణం, తాగునీరు, డ్రైనేజీతో పాటు అనేక సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. లక్ష్మీపతి, బల్‌రామ్, రాజు, నర్సింగ్‌రావు, పరశురామ్ పాల్గొన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలోని హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించగా 52 రోజుల్లో హుండీలతో పాటు అన్నదానం రూపంలో రూ.51,69,663, ఈ–హుండీ ద్వారా రూ.3,82, 591 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి కుంట నాగరాజు తెలిపారు. 211 అమెరికా, 10 కెనడా డాలర్లు ఉన్నాయన్నారు. లెక్కింపులో దేవాదయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సంధ్యారాణి, చైర్మన్ సాయిబాబాగౌడ్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

సాయన్న హయాంలోనే కంటోన్మెంట్ అభివృద్ధి



సాయన్న చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, లాస్య నందిత

కంటోన్మెంట్: దివంగత ఎమ్మెల్యే సాయన్న హయాంలోనే కంటోన్మెంట్ ఎంతో అభివృద్ధి చెందిందని పలువురు నాయకులు కొనియాడారు. సాయన్న వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం కంటోన్మెంట్ వ్యాప్తంగా ఆయన అభిమానులు చిత్ర పటాలు ఏర్పాటు చేసి నివాళి అర్పించారు. కార్ఖానాలోని ఎమ్మెల్యే క్యాంపు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, లాస్య నందిత కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్, బోర్డు ఉన్నతాధికారులు రాజ్‌కుమార్, మహేందర్, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత, మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ చామకూర భద్రారెడ్డి సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సాయన్న సతీమణి గీత, కుమార్తెలు నివేదిత, నమ్రత, స్థానిక బీఆర్‌ఎస్ నేతలు టీఎన్ శ్రీనివాస్, పనస సంతోష్, చిన్నా, టింకూగౌడ్, అజయ్ యాదవ్, భాస్కర్ ముదిరాజ్, మురళీ యాదవ్ పాల్గొన్నారు.

ఐదోవార్డులో..

కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ ఐదో వార్డు ప్రధాన కార్యదర్శి పెంట శ్రీహరి ఆధ్వర్యంలో సాయన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. స్థానిక పాఠశాల ఆవరణలో సాయన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు కిరణ్ కుమార్, కట్ట నరేందర్, సక్కుబాయి, శోభ, హరి, నరేందర్ యాదవ్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూమ్ గృహ సముదాయం వద్ద ..

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన దివంగత ఎమ్మెల్యే సాయన్న ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని సిల్వర్ కాంపౌండ్ డబుల్ బెడ్రూమ్ కమిటీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం సాయన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా సిల్వర్ కాంపౌండ్ డబుల్ బెడ్రూమ్ గృహ సముదాయం వద్ద ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నరేష్, అంజనేయులు, శ్రీనివాస్, షేక్ నయీం, రఘురామన్, బాల్‌రాజ్, ధన్‌రాజ్, కుమార్ గౌడ్, జిలానీ, గౌస్, సాగర్, వాహాబ్, యాదగిరి, అనిల్, భిక్షపతి నిసార్ పాల్గొన్నారు.



సాయన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఎస్సీ వర్గీకరణ ఫలించే రోజు దగ్గర పడింది



మంద కృష్ణ మాదిగ

రసూల్‌పురా: ఎస్సీ వర్గీకరణ అంశంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల వైఖరి మోసపూరితమైందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. సికింద్రాబాద్ పీజీ కళాశాల ఆడిటోరియంలో జరిగిన హైదరాబాద్ జిల్లా ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు, ఉపకులాల ప్రజలు గత 30 ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేస్తున్నారని ఈ పోరాటం ఫలించే రోజు దగ్గరికి వచ్చిందన్నారు. హైదరాబాద్ విశ్వరూప మహాసభలో ప్రధాని మోదీ ఇచ్చిన హామీకి అణుగుణంగానే ఎస్సీ వర్గీకరణ కమిటీ ఏర్పాటు చేసి చట్టబద్ధత ప్రక్రియ జరిగేలా కృషి చేస్తున్నారన్నారు. మోదీకి ఎస్సీ వర్గీకరణ అంశాన్ని వివరించి ప్రక్రియ వేగవంతం అయ్యేందుకు సహకరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఈసారి కూడా సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి మాదిగలు గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగ, ఏపీ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్, ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షులు సోమశేఖర్, రాగటి సత్యం. తిప్పారు లక్ష్మణ్, కొమ్ము శేఖర్, డప్పు మల్లిఖార్జున్, రాజు సుజాత పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో అవకాశం ఇవ్వండి



ఉస్మానియా యూనివర్సిటీ: పార్టీ కోసం పదేళ్లుగా పని చేస్తున్న నాయకులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని ఓయూ విద్యార్థి నేత నిరుద్యోగ జేఏసీ చైర్మన్ భీమ్‌రావునాయక్ పేర్కొన్నారు. సోమవారం నెహ్రూనాయక్, సుధీర్ రెడ్డి నివాసాలకు వెళ్లి పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. పార్టీ గెలుపు కోసం పని చేసిన వారిని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తిస్తారని, అసెంబ్లీ ఎన్నికల మాదిరి పార్లమెంట్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలని నెహ్రూనాయక్, సుధీర్ రెడ్డి సూచించారన్నారు.

యువతి అదృశ్యం

అడ్డగుట్ట: ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ దయాకర్ వివరాల ప్రకారం.. ఈస్ట్ మారేడుపల్లిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న మల్లిక(29) ప్రైవేటు ఉద్యోగిని. ఈ నెల 18న మధ్యాహ్నం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి రాత్రైనా రాలేదు. భయాందోళనకు గురైన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైల్వే వంతెనకు తల తగిలి కూలీ మృతి

రాంగోపాల్‌పేట్: ఇటుకల లోడ్‌తో వెళ్తున్న లారీపై ఉన్న ఓ కూలీ తల రైల్వే వంతెన గడ్డర్‌కు తగలడంతో మృతి చెందిన ఘటన సెక్రటరియేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన చవాన్ శివ (23) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి అత్తాపూర్‌లో ఉంటూ ఇటుక బట్టీలో కూలీగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి అత్తాపూర్ నుంచి ఐదుగురు కూలీలతో బయలుదేరిన లారీ ఆర్పీరోడ్ బైబిల్ హౌజ్ ప్రాంతానికి వచ్చింది. ఇటుకలపై చవాన్ శివ పడుకుని ఉన్నాడు. రైల్వే వంతెన వద్దకు రాగా చవాన్ శివ తల గడ్డర్‌కు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఎమ్మెల్యేకు పరామర్శ



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌ను మంగళవారం ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

బీజేపీ నాయకులకు..



పద్మారావునగర్: బీజేపీ సీనియర్ నాయకులు సురేష్, శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్ బల్‌రామ్ తల్లి రాజమణి ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న బండి సంజయ్ సోమవారం సీసీనగర్ బస్తీకి వచ్చి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివాజీ జయంతి

ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా సోమవారం సికింద్రాబాద్, సనత్‌నగర్ కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో భారీగా ర్యాలీలు, శోభాయాత్రలు నిర్వహించారు. ఆయా కూడళ్లలోని శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.

–సికింద్రాబాద్, సనత్‌నగర్ కంటోన్మెంట్ జోన్ల బృందం



శోభాయాత్రలో పాల్గొన్న వెల్లాల రామ్మోహన్



వారాసిగూడలో.. శివాజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ రామ్‌చందర్‌రావు



సీతాఫల్‌మండిలో.. మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో..



లాలాపేటలో.. జయంతి కార్యక్రమంలో పాల్గొన్న నేతలు



ఓయూలో.. శివాజీ చిత్రపటానికి నివాళి అర్పించిన విద్యార్థి నాయకులు



శివాజీ చిత్రపటానికి నివాళి అర్పించిన మర్రి పురురవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి



బేగంపేటలో.. శోభాయాత్రలో పాల్గొన్న శ్యాంసుందర్‌గౌడ్, తదితరులు